సాక్షి ఏలూరు

మంగళవారం । 9 । జనవరి । 2024



నేత్రపర్వం.. శ్రీవారి ఉత్సవం

ద్వారకాతిరుమల: ధనుర్మాస వేడుకల్లో భాగంగా చినవెంకన్న తిరువీధి సేవలు నేత్ర పర్వంగా సాగుతున్నాయి. భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పిస్తున్నారు.



కేవీకేలో శిక్షణ

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో తేనెటీగల పెంపకం, పండ్లు, కూర గాయలు, పూల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ప్రారంభమైంది.



విశేష అలంకరణ

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో 150 కిలోల ద్రాక్షతో స్వామిని విశేషంగా అలంకరించారు. పంచ హారతుల కార్యక్రమం ఘనంగా జరిగింది.

అన్నదాతకు అగ్రాసనం

పండుగలా వ్యవసాయం

- రైతుల సంక్షేమానికి పెద్దపీట
- రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు
- విత్తు నుంచి విక్రయం వరకూ అండగా..
- జిల్లాలో 520 ఆర్‌బీకేలు



ఏలూరు(మెట్రో): వ్యవసాయం దండగ రోజుల నుంచి వ్యవసాయం పండుగ అనే రోజులకు రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీసుకువచ్చింది. గత ప్రభుత్వాలు ఎటువంటి సహాయం అందించక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో జగనన్న సర్కారు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. పల్లెపల్లెనా రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే)ను ఏర్పాటుచేసి అన్నివిధాలా అండగా నిలుస్తున్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లోనే అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

విపత్తుల సమయంలో ఆదుకుంటూ..

రైతులు తమ రుణాలు పొందే వివరాలు దగ్గర నుంచి విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, యంత్ర సేవ పరికరాలు, భూసార పరీక్షలు ఇలా అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల్లో అందించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రధాన సాగు వరి, మొక్కజొన్న వంటి పంటల వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో రైతులు నమోదు చేసుకుని వాటిని విక్రయించుకునే ఏర్పాట్లను చేశారు. అలాగే విపత్తుల సమయాల్లో పంట నష్టం వివరాలను ఆర్‌బీకేల ఆధ్వర్యంలో సేకరిస్తూ రైతులకు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేలా సేవలందిస్తున్నారు.

సొంత భవనాల్లో 468 ఆర్‌బీకేలు

జిల్లావ్యాప్తంగా 520 రైతు భరోసా కేంద్రాలు ఉండగా 468 కేంద్రాలకు సొంత భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో 208 కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. 260 భవనాల నిర్మాణాలు పలు దశల్లో ఉండగా త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే 52 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటయ్యాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా వరి, అపరాలు, పొగాకు, మొక్కజొన్న మొత్తం 2,80,673 ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు.



ఆర్‌బీకేలో కియోస్కో యంత్రం

గ్రామాల్లోనే సేవలు



గతంలో ఎరువులు, పురుగుమందులు కావాలంటే మండల కేంద్రాలకు పరుగులు పెట్టేవాళ్లం. ప్రస్తుతం అటువంటి ఇబ్బంది ఏమీ లేదు. గ్రామాల్లోనే ఎటువంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయగలుగుతున్నాం.

–బల్లె రాంబాబు, వేగవరం

పారదర్శకంగా సౌకర్యాలు



రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు పారదర్శకంగా అందుతున్నాయి. పంట నష్ట పరిహారాలు, కొనుగోళ్ల వివరాలు, పంటల కొనుగోళ్లు వంటివి వీటి ద్వారానే చేపడుతున్నారు. గతంలో సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ ఇబ్బందులు లేవు.

–పోల్నాటి శ్రీనివాసరావు, శ్రీనివాసపురం

ఆర్‌బీకేల ద్వారా అన్ని సేవలు



రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందేలా చర్యలు తీసుకున్నాం. విత్తు దగ్గర నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ అధికారులు రైతులకు అండగా నిలుస్తున్నారు. సలహాలు, సూచనలు సైతం అందిస్తున్నారు.

–బి.లావణ్యవేణి, జేసీ, ఏలూరు

నాణ్యమైన ఆహారం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్ : పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఆహార కమిటీ సభ్యులు ఈ.లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కిరణ్‌కృష్ణ సూచించారు. లంకలకోడేరు హైస్కూల్ లో సోమవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజ నం అందిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, స్టాకు నిల్వలను పరిశీలించారు. 750 మంది విద్యార్థులకు 550 మంది భోజనం చేశారని, మొత్తం విద్యార్థులంతా ఆహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాలకొల్లులో రేషన్ దుకాణం, రేషన్ వాహనాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల గిడ్డంగిని పరిశీలించి స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా చూడాలన్నారు. తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎం.శివప్రసాద్, డీఎస్‌ఓ సరోజిని, ఏఎస్‌ఓ రవిశంకర్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, డీవైఈవో శ్రీరామ్ తదితరులు వారి వెంట ఉన్నారు.

న్యూస్‌రీల్

బాలుడికి అండగా ఎమ్మెల్యే నాని



బాలుడికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు 31వ డివిజన్‌కు చెందిన బండ్లమూడి కోటేశ్వరరావు, లక్ష్మీతులసి దంపతుల కుమారుడు దుర్గాజయాన్ష్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని మెరుగైన వైద్యం కోసం గతంలో రూ.5 లక్షలను సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందజేశారు. తర్వాత కాలంలో బాలుడికి క్రమంగా కంటిచూపు మందగించడంతో దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయించారు. సోమవారం ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో దివ్యాంగ పింఛన్ మొత్తాన్ని ఎమ్మెల్యే నాని అందజేశారు. బాలుడి కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్ ఉన్నారు.

ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలి



సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు అందిన దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, పోలింగ్ కేంద్రాల్లో కనీస ప్రాథమిక సౌకర్యాల ఏర్పాటు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో అందిన ఫాం 6, 7, 8 దరఖాస్తులు 7,800 వరకు ఉన్నాయని, వాటిని నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. ఎక్కడా చిన్న పాటి పొరపాట్లకు కూడా తావివ్వొద్దన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇంటర్‌నెట్ కనెక్షన్, ర్యాంపు వంటి కనీస సౌకర్యాల పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. 80 ఏళ్ల వయసు నిండిన ఓటర్లను పోలింగ్ బూత్ స్థాయి అధికారులు వారి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ బి.లావణ్యవేణి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ కేదారేశ్వరరావు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఎస్‌డీసీ గీతాంజలి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, కలెక్టరేట్ ఏఓ రమాదేవి పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షలకు 62 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో సోమవారం నిర్వహించిన డీఈఎల్‌ఈడీ 2వ సెమిస్టర్ పరీక్షలకు 64 మందికి 62 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

రేపు కబడ్డీ సెలెక్షన్స్

తణుకు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను తణుకు మండలం మండపాకలో ఈనెల 10న నిర్వహిస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కొరు శ్రీను, చైర్మన్ అప్పలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, పురుషులు 70 కిలోలలోపు, మహిళలు 65 కిలోలలోపు బరువు, 2004లోపు పుట్టిన వారై ఉండాలన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు సెల్ 94913 33906, 96424 96117 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి

ఏలూరు టౌన్: ఎస్సై పోస్టుల భర్తీకి సంబంధించి తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏలూరులోని డీఐజీ కార్యాలయానికి హాజరుకావాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్సై పోస్టులకు సివిల్, ఏపీఎస్‌పీ అభ్యర్థులు ఈనెల 10, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి హాజరుకావాలన్నారు. సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ధ్రువీకరణ పత్రాలను పూర్తి చేయడంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

చంద్రబాబువి కుట్ర రాజకీయాలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



రేలంగిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి కారుమూరి, రైతులు

ఇరగవరం: రాష్ట్రంలో ప్రతిపక్షనేత చంద్రబాబు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం రేలంగిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీఆర్ బాండ్ల గురించి మాట్లాడుతున్న చంద్రబాబు రాష్ట్రంలో టీడీఆర్ బాండ్లు తిరుపతి, విజయవాడ, విశాఖలో ఇచ్చి తణుకులో ఎలా అవినీతికి పాల్పడ్డారో దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. గతంలో చంద్రబాబు నిర్వహించిన రైతు పోరుబాటకు నాలుగు వందల మంది జనం కూడా రాలేదన్నారు. ఆచంటలో పెట్టిన బహిరంగ సభకు కూడా తక్కువ సంఖ్యలోనే ప్రజలు వచ్చారన్నారు. రైతులకు ధాన్యం సంచులు అందించలేదని చెబుతున్న చంద్రబాబు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. రైతులకు 1.14 కోట్ల ధాన్యం సంచులు అందించామన్నారు. లక్ష్యానికి కంటే మించి 10 లక్షల సంచులు అదనంగా ఇచ్చామన్నారు.

రైతులకు అన్నివిధాలా మేలు

వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు ధాన్యం గురించి, సంచుల గురించి ఏం తెలుసని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో 17.94 లక్షల మంది రైతుల నుంచి 2.65 కోట్ల టన్నుల ధాన్యం సేకరించగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇప్పటివరకు 36.60 లక్షల మంది రైతుల నుంచి 3 కోట్ల 33 లక్షల 86 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. గతంలో దళారుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైతుల నడ్డివిరవగా ఇప్పుడు రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో తడిసిన, మొక్క వచ్చిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేశామని చెప్పారు. రైతులకు మేలు చేస్తున్నాం కాబట్టే సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేస్తున్నారన్నారు. అనంతరం రైతులతో కలిసి ఆయన సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తణుకు నియోజకవర్గ నాయకులు చిట్టూరి సుబ్బారావు, పులుపు శ్రీను, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, బుద్ధారాతి భరణి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

33 మంది సీఐల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో భారీగా పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ)లకు స్థానచలనం కలిగింది. 33 మంది సీఐలను బదిలీలు చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెద్దెత్తున బదిలీలు చేపట్టినట్టు తెలుస్తోంది. పలువురిని విజయవాడ కమిషనరేట్‌కు పంపగా, ఎక్కువ మందిని వీఆర్‌లో పెట్టారు.

సీఐ	ప్రస్తుతం	బదిలీ
కె.కిషోర్‌బాబు	కాకినాడ డీపీటీసీ	విజయవాడ, కమిషనరేట్
తిప్పా గణేష్	తుని–2 టౌన్	విజయవాడ, కమిషనరేట్
ఆర్.విజయకుమార్	బొమ్మూరు, తూర్పుగోదావరి	విజయవాడ, కమిషనరేట్
ఎస్‌ఎస్‌ఎస్‌వీ నాగరాజు	తాడేపల్లిగూడెం	విజయవాడ, కమిషనరేట్
బలుమూరి వెంకటేశ్వరరావు	జీలుగుమిల్లి	విజయవాడ, కమిషనరేట్
కె.శివాజీ	వీఆర్, ఏలూరు జిల్లా	విజయవాడ, కమిషనరేట్
ఎ.సుబ్రహ్మణ్యం	విజయవాడ–టూటౌన్	వీఆర్, ఏలూరు రేంజ్
పి.కృష్ణమోహన్	గుణదల, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పెరవలి రామచంద్రరావు	విజయవాడ ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
అబ్దుల్ సలామ్	ట్రాఫిక్–వన్‌టౌన్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
బీబీ మురళీకృష్ణ	విజయవాడ, ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
వి.జానకిరామయ్య	విజయవాడ ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
కేవీ కృష్ణకుమార్	ఎస్ఈబీ, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.కృష్ణ	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.సత్యానందం	సైబర్‌క్రైమ్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
బీహెచ్ వెంకటేశ్వర్లు	ఎస్ఆర్ పేట, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎ.నాగమురళీ	గవర్నర్‌పేట, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎంవీ దుర్గారావు	కృష్ణలంక, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
కె.శ్రీనివాసరావు	నున్న, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.సుధాకర్	ట్రాఫిక్–1, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
కె.క్రిష్టాఫర్	ట్రాఫిక్–2, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఐడీ సువర్ణరాజు	ట్రాఫిక్–3, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.రామ్‌కుమార్	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.శ్రీనివాసరావు	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
జీవీ వినయ్‌మోహన్	పీసీఆర్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఆర్.అంకబాబు	వీఆర్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
వైఆర్‌కే శ్రీనివాస్	వీఆర్, ఏలూరు రేంజ్	సర్పవరం, కాకినాడ జిల్లా
ఎ.మురళీకృష్ణ	సర్పవరం, కాకినాడ జిల్లా	విజయవాడ, కమిషనరేట్
డి.గోవిందరావు	దిశ, కాకినాడ జిల్లా	వీఆర్, ఏలూరు రేంజ్
కె.వాసవి	దిశ, విజయవాడ	దిశ, తూర్పుగోదావరి
పీవీజీ తిలక్	కడియం, తూర్పుగోదావరి	డీఎస్‌బీ, వెస్ట్‌గోదావరి
కె.అప్పలస్వామి	వీఆర్, ఏలూరు రేంజ్	నరసాపురం పట్టణం
జి.శ్రీనివాసయాదవ్	నరసాపురం పట్టణం	ఉయ్యూరు, కృష్ణా జిల్లా

ఫుట్‌బాల్ అభివృద్ధికి కృషి

ఎంపీ కోటగిరి శ్రీధర్



ఏలూరులో రిఫరీ, క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏలూరు రూరల్: రాష్ట్రంలో ఫుట్‌బాల్‌కు మరింత ఆదరణ తెచ్చేందుకు కృషి చేస్తున్నామని ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఈనెల 6 నుంచి నిర్వహిస్తున్న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన కొల్లేరు జోన్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడకు మరింత ఆదరణ పెరిగిందన్నారు. పట్టణాలతో పాటు పల్లెల్లో బాలబాలికలు సైతం ఫుట్‌బాల్ క్రీడపై మక్కువ పెంచుకుంటున్నారన్నారు. ఆటకు మరింత ప్రజాదరణ కల్పించేందుకు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ స్టేట్ క్లబ్ చాంపియన్‌షిప్ పోటీలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా ప్రతి జోన్‌లో పోటీలు జరుగుతున్నాయన్నారు. ఏలూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మణిశంకర్ మాట్లాడుతూ కొల్లేరు జోన్‌లో పశ్చిమ, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పలు జట్లు పాల్గొన్నాయన్నారు. మొత్తంగా 15 మ్యాచ్‌లకు గాను 9 మ్యాచ్‌లు నిర్వహించగా, ఏలూరు క్లబ్, సంగీతం మెమోరియల్ జట్లు అత్యధిక పాయింట్లు సాధించాయన్నారు. మిగిలిన 6 మ్యాచ్‌లు విజయవాడలో నిర్వహిస్తామన్నారు. కార్యదర్శి జీఎస్ఎస్ పవన్‌కుమార్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు పీడీ ప్రదీప్, సాగర్, కె.శ్రీకాంత్, ఆలీబాబా, ఎం.అనిల్‌కుమార్, ఎం.రాంబాబు, పి.ఆలీబాబా తదితరులు ఎంపీ శ్రీధర్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు పోటీలను పర్యవేక్షించారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో) : జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తంగా 374 అర్జీలు అందాయన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఈనెల 10 నుంచి మండల స్థాయిలో ఆడుదాం–ఆంధ్ర పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

అర్జీల్లో కొన్ని..

- ఏలూరు మండలం తిమ్మవారిగూడెంకు చెందిన జీవరాజు తమ ఇంటికి వెళ్లే మార్గంలో అడ్డంగా నిర్మించిన ప్రహరీ, విద్యుత్ స్తంభం తొలగించాలని అర్జీ అందజేశారు.
- దొరమామిడికి చెందిన సూర్యనారాయణ తన భూమిని సాగు చేసుకోకుండా ఓ వ్యక్తి అడ్డుకున్నారని, న్యాయం చేయాలని కోరారు.
- టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెంకు చెందిన హనుమంతరావునాయుడు తమకు బొర్రంపాలెంలో ఉన్న భూమికి సర్వేయర్ ద్వారా కొలతలు వేయించగా భూమి తక్కువగా చూపించారని, సరిచేయించాలని కోరారు. డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి ఈనెల 18 వరకు సంక్రాంతి సెలవులు మంజూరు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని మిషనరీ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈనెల 10 నుంచి 18 వరకు సెలవులు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి పాఠశాలలు పునః ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. సెలవు దినాల్లో జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌ల ద్వారా ప్రధానోపాధ్యాయులు పాఠశాల ఆస్తులను కాపాడాలని సూచించారు. సెలవు దినాల్లో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో తరగతులు నిర్వహించరాదని, ఈ విషయమై ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ సభ్యులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ఏలూరులో సాహిత్య, సంక్రాంతి సంబరాలు

రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి



ఏలూరు టౌన్: ఏలూరులో రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సాహిత్య, సంక్రాంతి సంబరాలు ఈనెల 11 నుంచి నిర్వహిస్తుంచనున్నట్టు రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తెలిపారు. ఏలూరులో సోమవారం ఆమె మాట్లాడుతూ తెలుగు భాష, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలను నిర్వహిస్తామన్నారు. భోగిమంటలు, గంగిరెద్దుల ప్రదర్శన, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు, కవి సమ్మేళనం, కవుల సత్కారాలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల కవులు పాల్గొనాలని కోరారు. వేడుకలకు ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారన్నారు.

ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పాలకొల్లు అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని రెండు మెడికల్ ల్యాబ్‌లను సోమ వారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు, ధరల పట్టిక, ఫైర్ ఎగ్జిస్ట్, ల్యాబ్‌లో పనిచేస్తున్న సిబ్బంది విద్యార్హతలు, గుర్తింపు సర్టిఫికెట్ తదితర వివరాలు పరిశీలించి సూచనలు చేశారు. ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్ లేకపోయి నా, రెన్యూవల్ చేయించకపోయినా సీజ్ చేస్తామన్నారు. మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబా బు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎంఆర్‌కే రాజు ఆయన వెంట ఉన్నారు.

క్లుప్తంగా

15 నుంచి నూజివీడులో బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు: నూజివీడులోని డీఏఆర్ కళాశాల ఆవరణలో ఈనెల 15 నుంచి 18 వరకు కళాప్రపూర్ణ శ్రీరాజా వెంకటాద్రి అప్పారావు బహాద్దూర్ మెమోరియల్ 47వ జాతీయ స్థాయి పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆక్రో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బండి రామ్మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించే ఈ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా జట్లు పాల్గొంటాయన్నారు. పోటీల్లో మొత్తం 40 జట్లు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

మహిళ హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ఏలూరు (టూటౌన్)/పెదవేగి: మహిళ హత్య కేసులో నేరం రుజువు కావడంతో ఓ నిందితుడికి జీవితకాల ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ ఏలూరు ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి జీ.రామ్‌గోపాల్ సోమవారం తీర్పు చెప్పారు. ఏపీపీ లక్ష్మణ్ నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2020 జూలై 7న మొండూరు గ్రామం దగ్గరలో ఉన్న పోలవరం కుడికాల్వ గట్టు పక్కన మట్టిదిబ్బల దగ్గర సుమారు 30 సంవత్సరాలు వయస్సు కలిగిన మహిళ మృతదేహాన్ని వీఆర్వో శివకనక వెంకట అప్పారావు గుర్తించి పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చున్నీని మెడకు బిగించి మహిళను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును అప్పటి పెదవేగి ఎస్సై నాగరాజు కేసు నమోదు చేయగా, అప్పటి ఏలూరు రూరల్ సీఐ అనసూరి శ్రీనివాసరావు నిందితుడైన నాగులదేవునిపాడుకు చెందిన గుజ్జుల సందీప్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో ఈ కేసు విచారణలో సాక్షాధారాలతో నిందితుడి నేరం రుజువు కావడంతో గుజ్జల సందీప్‌కు యావజ్జీవ ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు పెదవేగి ఇన్‌స్పెక్టర్ కొండవీటి శ్రీనివాసరావు, ఎస్సై లక్ష్మణ్, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ వాసు సహకరించారు.

కోడిపందేలు, జూదాన్ని ఉపేక్షించం

- జిల్లాలో పటిష్టమైన నిఘా ఏర్పాటు
- ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి



డీ.మేరీ ప్రశాంతి, ఏలూరు జిల్లా ఎస్పీ

ఏలూరు టౌన్: రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి హెచ్చరించారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడిపందేలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పేకాట, జూదం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి చర్యలు చేపడతామన్నారు. కోడి పందేలు, కోడికత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై గట్టి నిఘా ఉంచామన్నారు. కోడిపందేలు, జూదం వంటివాటితో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశపడి పందేలు కాసేవారి తమ విలువైన సొమ్ము నష్టపోతున్నారని, పండుగ పూట వారి జీవన విధానం అస్తవ్యస్తం అవుతుందన్నారు. కోడిపందేల నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తప్పవన్నారు. యువతపై కేసులు నమోదు అయితే వారి బంగారు భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ఇతర దేశాల్లో ఏదైనా ఉద్యోగమో, ఉపాధి కోసం, ఉన్నత విద్యకు వెళ్లాలంటే కేసులు అడ్డంకిగా మారతాయని జిల్లా ఎస్పీ హితవు పలికారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా 100, 112, వాట్సాప్ నంబర్ 83329 59175కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని కోరారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టోల్‌ఫ్రీ నంబర్ 14500 లేదా 073826 23669కు కాల్ చేసి చెప్పాలని ఎస్పీ కోరారు. సమాచారం తెలిపిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.

కోళ్లఫారంలో రేషన్ బియ్యం పట్టివేత



సూరేపల్లిలో పట్టుబడిన బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు: సూరేపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టుకుని సీజ్ చేసినట్లు నూజివీడు సివిల్ సప్లయిస్ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ గుండుబోయిన వెంకటేశ్వరరావు సోమవారం చెప్పారు. మండలంలోని సూరేపల్లి గ్రామంలో నరదల మల్లయ్య, నాగేశ్వరరావులకు చెందిన కోళ్లఫారంలో చాట్రాయి మండలానికి చెందిన గోపి అక్రమంగా నిల్వ ఉంచిన టన్ను రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం దాడి చేసి పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం పక్కదారి పడితే సహించేది లేదని, క్రిమినల్ కేసులు విధించడంతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పట్టుకున్న బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

చింతమనేని అప్పీలు కేసు ఫిబ్రవరి 13కు వాయిదా

ఏలూరు (టూటౌన్): దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సంబంధించిన అప్పీల్ కేసు వచ్చే నెల 13వ తేదీకి వాయిదా పడింది. గతంలో ఒక కేసు విషయంలో భీమడోలు కోర్టు రెండు వేర్వేరు సెక్షన్లల్లో మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. దీనిపై ఆయన విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు అప్పీల్‌కు వెళ్లారు. తరువాత హైకోర్టుకు వెళ్లి ఈ కేసును ఏలూరు ఫస్ట్ ఏడీజే కోర్టుకు బదిలీ చేయించుకున్నారు. అయితే కొంతకాలంగా ఈ కేసు విచారణ మందకొడిగా సాగుతుండటంతో ప్రజాప్రతినిధుల కేసులు వేగవంతం చేయాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాపీని ఏపీపీ లక్ష్మణ్ నాయక్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కేసును వేగవంతంగా విచారించి తీర్పు వెలువరించాలని కోరారు. అయితే చింతమనేని తరుపు న్యాయవాదులు విధుల బహిష్కరణలో ఉన్నందున ఈ కేసును వాయిదా వేయాలని అభ్యర్థించారు. దీనిపై ఫస్ట్ ఏడీజే జడ్జి రామ్‌గోపాల్ కేసును వచ్చే నెల 13కు వాయిదా వేశారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరు 5వ అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. ఏపీపీ డీవీ రామాంజనేయులు కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో 2019 జూలై 1న తాపీ పనిచేయడానికి వెళ్లిన కంభాల సూరిబాబు ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి బెదిరించిన కేసులో కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై సాక్ష్యాధారలతో నేరం రుజువు కావడంతో నిందితుడు కంభాల సూరిబాబుకు రెండేళ్ల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి జీ.రాజేశ్వరి తీర్పువెలువరించారు.

ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక



సాయికిరణ్

భీమడోలు: భీమడోలులోని శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి దుద్దుపూడి సాయికిరణ్ ఈనెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యాడు. కాకినాడ గ్రూప్, 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్ నుంచి ఈ ఏడాది రిపబ్లిక్‌డే వేడుకలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ బొమ్మ రవికుమార్ సోమవారం విద్యార్థిని అభినందించారు. 2017లో తమ కళాశాల విద్యార్థి బి.నవీన్‌సాయి హాజరు కాగా, కిరణ్ రెండో విద్యార్థి అని ప్రిన్సిపాల్ తెలిపారు. సాయికిరణ్‌ను ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ కె.శివశంకర్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధుడి సజీవ దహనం



దగ్ధమైన పూరిల్లు, అంతరచిత్రం నాగేశ్వరరావు (ఫైల్)

కలిదిండి: మూలలంక శివారు చిన్నపుట్లపూడిలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ వృద్ధుడు సజీవదహనమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఓ పూరింట్లో నివాసం ఉంటున్న శీలం నాగేశ్వరరావు (80) ఒంటరిగా జీవిస్తున్నాడు. భార్య కొన్నేళ్ల క్రితమే మృతి చెందగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు జీవనోపాధి నిమిత్తం వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఇదిలా ఉండగా, సోమవారం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు శరీరం కాలి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చింతలపూడి: ప్రగడవరం శివారు అంకంపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రగడవరం గ్రామానికి చెందిన గొల్లపల్లి వినోద్ కుమార్(ఇన్ను) ద్విచక్ర వాహనంపై ప్రగడవరం నుంచి ఫాతిమాపురం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఎస్సై కె ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనుమంట్ర: మల్లిపూడి శివారులో పేకాటాడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ప్రొబేషన్ డీఎస్పీ, పెనుమంట్ర ఇన్‌చార్జ్ ఎస్సై కె.అరవింద్ సోమవారం చెప్పారు. వారి నుంచి రూ.20,600 నగదు, 4 బైక్‌లు, 9 స్మార్ట్ ఫోన్‌ల స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీ, దోపిడీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

- 4 కేసుల్లో రూ.1.70 లక్షల చోరీ సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఈ.శ్రీనివాసులు



ఏలూరులో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, చిత్రంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో దోపిడీ, ఇళ్లల్లో చోరీలు, చైన్ స్నాచింగ్ కేసుల్లో ఇద్దరు నిందితులను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌లో కేసు వివరాలను ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా జిల్లా గుటిల గ్రామానికి చెందిన సాబీర్ అలియాస్ బీజందర్ ఖాన్, ఆగ్రా జిల్లా జగదీష్‌పుర పోస్ట్, బీచ్‌పురి గ్రామానికి చెందిన పూరన్‌సింగ్ ఏలూరు నగరంలోని మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లపై ప్రయాణించే వ్యక్తులను కొట్టి డబ్బులు, బంగారు నగలు లాక్కొని వెళ్లిపోవటం, రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు చేస్తున్నారు. ఇలా 2023 సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలల్లో వీరు ఏలూరు నగరంలో పలు నేరాలకు పాల్పడ్డారు. నిందితులను పట్టుకునేందుకు ఎస్పీ డీ.మేరీప్రశాంతి ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో నిడమర్రు సీఐ సుభాష్, వన్‌టౌన్ ఎస్సై ఎన్.లక్ష్మణబాబు బృందాలుగా ఏర్పడి గాలింపు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఏలూరు 7వ డివిజన్ కత్తేపువీధి డాక్టర్ మల్లయ్య హాస్పిటల్స్ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఈ విచారణలో వీరిద్దరూ ఏలూరు నగరంలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో నాలుగు నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. ఏలూరు వన్‌టౌన్‌లో మోటార్ సైకిల్ చోరీ, ఏలూరు రూరల్ ప్రాంతంలోని ఓ ఇంట్లో రూ.10 వేల నగదు అపహరణ, ఏలూరు వన్‌టౌన్‌లో 38 గ్రాముల బంగారపు నెక్లెస్, ఏలూరు టూటౌన్‌లో ఒక మోటారు సైకిల్‌ను చోరీ చేశారు. నిందితుల నుంచి చోరీ సొత్తును పోలీసులు రికవరీ చేశారు. వీటి విలువ సుమారుగా రూ.1.70 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన పోలీస్ టీమ్ సభ్యులు చేబ్రోలు హెచ్‌సీ కే.నాగరాజు, పీసీ ఎస్.నాగరాజు, ఏలూరు వన్‌టౌన్ పీసీ బి.నాగార్జున, ఎంఆర్‌పీ దుర్గారావు, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎండీ రుహుల్లా, సీసీ కెమెరా టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ జీఎస్ఎన్ వర్మను ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.